## క్లుప్తంగా

### తహసీల్దార్ విజయ ప్రసాద్‌కు సత్కారం



ఘంటసాల: కృష్ణాజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అత్యధికంగా నిధులు సమకూర్చి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ పొందిన ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. మచిలీపట్నం జెడ్పీ సమావేశపు హాలులో కృష్ణాజిలా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. విజయ ప్రసాద్‌ను సత్కరించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ఎస్ బాలాజీ, భవిరి శంకరనాథ్ పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ వాహనాల షోరూమ్ ప్రారంభం



చల్లపల్లి: స్థానిక పడమర వీధిలోని జెండాచెట్టు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన సిద్దినేని ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూమ్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోందన్నారు. షోరూమ్ ప్రారంభించిన సిద్దినేని అశోక్ నాయుడిని అభినందించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, సర్పంచ్ పి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ



చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్(హైస్కూల్ ప్లస్) చదువుతున్న విద్యార్థినులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి ఆర్థిక సహకారంతో రూ.10 వేలు విలువైన పుస్తకాలను స్టూడెంట్స్‌కి అందజేశారు. ఉమాసరస్వతిని ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.సురేష్, టీచర్లు వై.పావనేశ్వరి, పూర్ణచంద్రరావు, లక్ష్మి, మణిమాధవి తదితరులు అభినందించారు.

### పార్టీ నాయకుడి మృతికి సంతాపం



కృత్తివెన్ను: మండలంలోని చినగొల్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బూసి దీనరాజు తండ్రి బూసి డేవిడ్ మరణించడంతో ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము సందర్శించారు. గురువారం ఉదయం ఆయన చినగొల్లపాలెం వచ్చి దీనరాజు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు, స్థానికులు ఉన్నారు.

### నాణ్యమైన వరి విత్తనాలు సాగు చేయాలి



ఘంటసాల: నాణ్యమైన వరి విత్తనాలు ఉత్పత్తి చేసి వ్యాపారవేత్తలుగా మారవచ్చునని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో వరి నాణ్యమైన విత్తన ఉత్పత్తి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం గురువారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ నాణ్యమైన వరి ఉత్పత్తి భాగంలో విత్తనోత్పత్తిలో మెళకువలు, నాణ్యమైన విత్తనాలు వలన మంచి వ్యాపారవేత్తలుగా తయారు అవ్వాలో గ్రామీణ యువతకు మెలకువలు నేర్పించారు. సమగ్ర కలుపు యాజమాన్యంపై డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, యువత పాల్గొన్నారు.

### నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ తెలిపారు. శ్రావణ మాసం శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతం చేపడతారన్నారు. అనంతరం అన్నప్రసాదం అందజేస్తామని చెప్పారు.

# సముద్రుడి చెంతకు కృష్ణమ్మ

చల్లపల్లి/కోడూరు/మోపిదేవి/శ్రీకాకుళం(ఘంటసాల): ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు దిగువకు వదలటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. గురువారం సాయంత్రానికి నదిలోని నీరు క్రమంగా పెరిగింది. నీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో కరకట్ట దిగువన ఉన్న మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసిన 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు హంసలదీవి వద్ద సముద్రంలో చేరుతుంది. ఓ వైపు సముద్ర అలలు, మరో వైపు ప్రశాంతంగా వచ్చి



హంసలదీవి సాగర సంగమం వద్ద కలుస్తున్న వరద నీరు



శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

చేరుతున్న కృష్ణమ్మతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారింది. ఇప్పటికే గ్రామాల్లో పసుపు, కంద, అరటి వంటి మెట్ట పంటలు ముంపునకు చేరువలో ఉన్నాయి.

**అప్రమత్తంగా ఉండాలి..**

కృష్ణానదికి వరద నీరు వదలడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, మోపిదేవి ఇన్‌చార్జి తహసీల్దార్ వనజాక్షి తెలిపారు. కృష్ణానదికి గురువారం సాయంత్రానికి 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశామన్నారు. లంక గ్రామాలతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందులో భాగంగా రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులు, మేకల మేతకు, చేపల వేటకు ఎవరూ వెళ్లరాదని చెప్పారు.

## నగదు తీసుకుని ఇల్లు నిర్మించని వారిపై దృష్టి పెట్టండి

పెడన:పేదల ఇంటి నిర్మాణానికి నగదు లేదంటే ముందుగా నగదు డ్రా చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని, దీంతో పలువురు నగదు తీసుకుని ఇంటిని నిర్మించకుండా ఉన్నారని, అటువంటి వారితో త్వరితగతిన ఇల్లు నిర్మించేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ పీడీ పోతురాజు ఆదేశించారు. గురువారం ఆయన పట్టణం, మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 29న గృహ ప్రవేశాలయ్యేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ పోతురాజు

ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈ బుచ్చిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శివప్రసాద్, హౌసింగ్ ఏఈలు మాధవి, వహెదా పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు విశ్రాంత ఉద్యోగులు కృషి చేయాలి

గోగినేనిపాలెం(ఘంటసాల): సమాజ శ్రేయస్సు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేసేందుకు విశ్రాంత ఉద్యోగులు కృషి చేయాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ తెలిపారు. మండల పరిధిలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ పని చేస్తున్న నలకుర్తి సుధాకరరావు పదవీ విరమణ, అభినందన కార్యక్రమం విశ్రాంత ఎంఈవో వి.మురళీ కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నలకుర్తి సుధకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవరపల్లి సురేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు కైతేపల్లి దాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆది నారాయణ, ఎంఈవో 1, 2లు ఎస్.శివశంకరావు, ఎండీ మోమిన్, ఏఎంసీ వైస్ చైర్మన్ అత్తులూరి గోపీచంద్, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు ఎం.భార్గవ, బసవేశ్వరరావు, పిచ్చేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.



సుధాకరరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, నాయకులు

## యూరియా కొరతతో రైతుల ఆందోళన

అడపావారిపాలెం(మోపిదేవి): యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపావారిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా అందడం లేదని గురువారం పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో సుమారు 4 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. వరి నాట్లు పూర్తి కావడంతో ప్రారంభదశగా యూరియా ఎక్కువగా రైతులు వినియోగిస్తారు. మండలానికి సుమారు 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు కేవలం 236 మెట్రిక్ టన్నులు మాత్రమే మండలానికి వచ్చింది. ఇప్పటి వరకు వచ్చిన యూరియాను రైతులకు అందించామని, ఇంకా 255 మెట్రిక్ టన్నులు రావాలని ఏవో హెప్సిబారాణి చెప్పారు.

## సంక్షిప్త వార్తలు

**• గురుకుల పాఠశాలలో ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు**

మచిలీపట్నంఅర్బన్: రుద్రవరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో మిగిలిన ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి ఏడో తరగతి వరకు, జూనియర్ ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగస్టు 4వ తేదీ లోపు పాఠశాలలో పిల్లలను చేర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 97045 50058 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

**• విధులు పట్ల అంకిత భావంతో పనిచేసిన గిరి**



పెడన: పురపాలక సంఘ కార్యాలయంలో 15 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పిచ్చుక వెంకట గిరిప్రసాద్(గిరి) మంచి గుర్తింపు తెచ్చుకున్నారని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన గిరి, కనకమహాలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గిరి అందించిన సేవలను కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి, టీపీవో బి.సుజనాకుమారి, ఏఈ కాగిత సీతారామాంజనేయులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**• జిల్లా క్రీడా కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం**

మచిలీపట్నంఅర్బన్: జిల్లా డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ(డీఎస్జీఎస్) పదవీకాలం ముగియడంతో 2025 నుంచి 27 వరకు రెండేళ్లకు గాను నూతన క్రీడా కార్యదర్శి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు డీఈఓ పీవీజే రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా సంచాలకులు ఉత్తర్వులు ప్రకారం 58 ఏళ్ల లోపు వయసు కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న పీఈటీలు దరఖాస్తు చేయవచ్చన్నారు. గతంలో ఇదే పదవిలో పనిచేసిన వారు అర్హులు కాదన్నారు. అర్హులైన పీఈటీలు ఆగస్టు 4వ తేదీలోగా దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

**• రేపు ఉపాధ్యాయుల సమస్యలపై ఫ్యాప్టో ధర్నా**

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ కృష్ణాజిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ధర్నా సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు సంబంధించిన 18 డిమాండ్లతో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో ఫ్యాప్టో అనుబంధ సంఘాలు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారం అధికమై బోధన ప్రభావితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీపీటీఏ, ఏపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు కనకారావు, హుస్సేన్, ఇమ్మానుయేల్, కృష్ణమూర్తి, నవీన్, శివరామకృష్ణ, సాల్మన్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకుడు గంగాధర్ పాల్గొన్నారు.

**• వాటర్ ట్యాంక్ పరిశీలన**

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ వాటర్ ట్యాంక్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీహెచ్‌డీ ప్రసన్న, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని సర్పంచ్ డీఈ దృష్టికి తీసుకెళ్లగా ఆమె వాటర్ ట్యాంక్‌ని పరిశీలించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు డీఈ చెప్పారు. పంచాయతీ ఈవో అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ భార్గవ్, ప్రభు ప్రభాకర్ పాల్గొన్నారు.

**• ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు**



గూడూరు: వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని గూడూరు ఎస్‌ఐ కె.సత్యనారాయణ స్పష్టం చేశారు. గూడూరు సెంటరులో వాహన దారులకు గురువారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపేవారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్‌ఐ షేక్ బషీరా, సిబ్బంది పాల్గొన్నారు.

**• పరిసరాలు శుభ్రంగా ఉంచాలి**

పెడన: వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శివప్రసాద్ అన్నారు. మండలంలోని జింజేరు గ్రామంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. అంగన్‌వాడీ సెంటరు, ప్రాథమిక పాఠశాల, చెత్త సంపద కేంద్రం తదితర పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందన



మచిలీపట్నంటౌన్: గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మచిలీపట్నంకు చెందిన అంతం కొల్లా హర్షిత్ సాయి రెండు బంగారు పతకాలు సాధించాడు. 66 కిలోల విభాగంలో ఈక్వయిప్డ్, బెంచి ప్రెస్‌లో హర్షిత్ సాయి అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రెండు బంగారు పతకాలను సాధించాడు. హర్షిత్ సాయి నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణరెడ్డి, ప్రిన్సిపాల్ వి.నరసింహారావు, రీజినల్ మేనేజర్ సురేంద్రరెడ్డి, కళాశాల ఏఓ బాపూజీ హర్షిత్ సాయిని అభినందించారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొక్కలు అందజేత



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణికి అవనిగడ్డ రెడ్‌క్రాస్ యూనిట్ వంద మొక్కలు అందించింది. పులిగడ్డ నర్సరీ నుంచి సేకరించిన ఈ మొక్కలను ప్రిన్సిపాల్‌కు రెడ్ క్రాస్ యూనిట్ అధ్యక్షుడు వంగర శేషగిరిరావు గురువారం అందజేశారు. వీటిని కళాశాల ఆవరణలో పెట్టించి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ గరికపాటి హరిప్రసాద్, కోశాధికారి అల్లంశెట్టి వెంకటేశ్వరరావు, ఆది రామ్మోహనరావు, అధ్యాపకులు ఏ వీరకుమారి, జి.నాగార్జున పాల్గొన్నారు.

### ద్వాదశ జ్యోతిర్లింగ అష్టాదశ శక్తిపీఠాల వేదిక ప్రారంభం



ఘంటసాల: ఘంటసాల గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి దేవాలయంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింక క్షేత్రాల వేదికను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గురువారం ప్రారంభించారు. స్కంద పురాణంలో విశిష్టతను అనుసరించి వేదిక ఏర్పాటు చేసిన నిర్వాహకులను, సహకరించిన దాతలను అభినందించారు. దాతలు పాలడుగు శివశంకరరావు - ఈశ్వరమ్మ దంపతులు, దావులూరి ప్రకాశరావు - శ్రీరావమ్మ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. రుత్వికులు చావలి దుర్గా ప్రసాద్ దీక్షితుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయార్చకులు చావలి కృష్ణ కిషోర్, దాలిపర్తి చలపతిరావు, ఆలయ కమిటీ ప్రతినిధి గొర్రెపాటి రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

### 167 వితంతు పింఛన్ల మంజూరు

గూడూరు: వివిధ కేటగిరీల్లో సామాజిక పింఛన్లు తీసుకుంటూ మృతి చెందిన లబ్ధిదారుల భార్యలకు ప్రభుత్వం మంజూరు చేసిన వితంతు పింఛన్ల భాగంగా గూడూరు మండలంలో 167 మందికి పింఛన్లు మంజూరైనట్లు గూడూరు ఎంపీడీఓ టి.అనూహ్య తెలిపారు. వీరందరికీ శుక్రవారం ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ నగదు పంపిణీ చేస్తామని చెప్పారు.

## హజ్ యాత్రికులకు లక్ష రూపాయల నజరానా



పెడన: కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు హజ్ యాత్రకు వెళ్లి తిరిగి వచ్చి యాత్ర ముగిసిన పిమ్మట రూ.లక్ష నజరానాను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ షేక్ హాజీ హసన్ బాషా తెలిపారు. స్థానిక ఐదో వార్డులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు మక్కా వెళ్లడానికి సౌదీ నుంచి నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సెంట్రల్ హజ్ కమిటీ వారు రిలీజ్ చేశారని, మక్కా వెళ్లే వారికి ఈనెల 31 వరకు సమయం ఉందన్నారు. జిల్లాలు తిరిగి సొసైటీ వారికి ఆన్‌లైన్ పూర్తి చేయాలని కోరామని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యమైనందున మరల 20 రోజులు సమయాన్ని పొడిగించాలని మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ ద్వారా కేంద్రాన్ని కోరామన్నారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు అబ్దుల్ ఖదీర్ రెహమాన్ బేగ్, అబ్దుల్‌ఖయ్యూం, అబ్దుల్ గఫార్, వాబ్‌ఖాన్, హామీదుల్లా, సులేమాన్, బాబు పాల్గొన్నారు.

## కాపు ఆడబిడ్డకు అన్యాయం చేస్తే సహించం

చిలకలపూడి(మచిలీపట్నం): టీడీపీ నాయకుడి కుమారుడు నయవంచన చేసిన కాపు ఆడబిడ్డకు న్యాయం జరిగేంత వరకు తాము అండగా ఉంటామని కాపు యువసేన, జనసేన నాయకులు అన్నారు. కృష్ణా జిల్లా ప్రభుత్వాస్పత్రిలో బాధితురాలి తల్లి శివపార్వతి, తండ్రి కోటేశ్వరరావులను గురువారం వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు రోజులుగా పత్రికల ద్వారా వస్తున్న వివరాలు పరిశీలిస్తున్నామని, అయితే కాపు ఆడబిడ్డకు న్యాయం చేయాలని తాము ప్రభుత్వాసుపత్రికి వచ్చామని చెప్పారు. న్యాయం జరగ్గకపోవటంతో ఆత్మహత్యాయత్నం చేసిన కాపు మహిళకు న్యాయం జరిగే వరకు తాము సహకారం అందిస్తామన్నారు. ఇటువంటి పరిస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులకు బెదిరింపు కాల్స్ రావటం ఎంతో దౌర్భాగ్యమన్నారు. అధికారపక్షం వారినైనా వదిలేది లేదని, బాధితులకు అన్యాయం జరిగితే పర్యవసనాలు దారుణంగా ఉంటాయని హెచ్చరించారు. వారిద్దరికి వివాహం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాపు యువసేన, జనసేన నాయకులు కొట్టే వెంకట్రావు, శాయన శివయ్య తదితరులు ఉన్నారు.



శివపార్వతిని పరామర్శిస్తున్న కాపు యువసేన, జనసేన నాయకులు

## విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): విధి నిర్వహణలో ఉద్యోగులు ప్రమాణాలు పెంచుకుంటూ మెరుగ్గా అంకితభావంతో పనిచేయాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఎంపికై న అభ్యర్థులకు ఉద్యోగ నియామకపత్రాలను బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ దేశంలోనే బ్యాంకు కార్యకలాపాల్లో ఐదో స్థానంలోపు ఉన్న కేడీసీసీ బ్యాంక్‌లో ఉద్యోగం రావటం ఎంతో శుభపరిణామమన్నారు. నియామకాలు అందుకున్న వారికి ఈ నెల 18వ తేదీ నుంచి హైదరాబాద్‌లో వారంరోజుల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి బ్రాంచ్‌లు కేటాయిస్తామన్నారు. పీఏసీఎస్‌లో 10 ఏళ్లుగా పనిచేస్తూ ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని ఎంపికైన 15 మంది, డైరెక్ట్‌గా దరఖాస్తు చేసుకుని ఎంపికైన 39 మందికి ఆయన నియామకపత్రాలను అందజేశారు. అనంతరం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన బోర్డు సమావేశంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం కిసాన్ డ్రోన్స్‌ను రైతు గ్రూపులకు అందజేస్తోందన్నారు. ఇందుకు సంబంధించి తమ బ్యాంకు ద్వారా ఈ రుణాలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు జరిగిన వ్యాపార లావాదేవీలపై సమీక్షించామన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కోసం తమ బ్యాంకు రూ.2 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ఆయన తెలిపారు. బ్యాంక్ సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్, ఆప్కాబ్ నోడల్ అధికారి పీఎస్ మణి పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ రఘురామ్

## యువతులు ఆరోగ్య నియమాలు పాటించాలి

మచిలీపట్నంటౌన్: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న యువతులు ఆరోగ్య నియమాలు పాటిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పలువురు వైద్యులు సూచించారు. శ్రీ సత్య సాయి సేవా సమితి మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామానాయుడుపేటలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమీపంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ కాత్యాయని, వీరంకి రాజీవి, నిఖిల, శృతిక మాట్లాడుతూ.. ఆహార నియమాలను పాటించాలని, ఆరోగ్యంగా ఉండటమే కాకుండా భవిష్యత్తులో వివాహం అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేందుకు ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ ఎల్.సునీత, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ వైవీఎం మల్లేశ్వరి, సమితి సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరుణ కాత్యాయని

### విద్యా సామగ్రి పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని నారాయణపురం, దేవునితోట ప్రాంతాల్లోని యానాదులు కాలనీల్లో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, ప్యాడ్లు, పెన్నులు, రెండు వాటర్ క్యాన్లు, కేకులు బిస్కెట్లు అందజేశారు. ఆ సంస్థ సభ్యుడు వెంకటేశ్వరరావు మనుమరాలు హేమాంషి జన్మదినం సందర్భంగా వీటిని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎం.ఫణి ధూర్జటి మాట్లాడుతూ ఈ రెండు ప్రాంతాల్లో ఆధార్ కార్డులను అందించేందుకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డెప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ నారాయణపురంలోని ఎస్టీ విద్యార్థులకు రూ.5 వేలతో స్టీల్ ప్లేట్లు, వాటర్ క్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్ కుమార్, కార్యదర్శి హసీం బేగ్, జాయింట్ సెక్రటరీ పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



### పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థిని చదువు కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.21 వేల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చందన వెంకట్ స్థానిక చిలకలపూడిలోని ఆ సంస్థ కార్యాలయంలో గురువారం అందజేశారు. నందిగామకు చెందిన విద్యార్థిని కుంచాల నక్షత్ర పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. అయితే ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటర్ మొదటి ఏడాది ఫీజు కట్టలేక చదువుకు స్వస్తి పలకటంతో స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్‌కు ఈ విషయం తెలియటంతో విద్యార్థిని నక్షత్ర ఇంటర్‌కు ఫీజు చెల్లించేందుకు నగదును అందజేశారు.

### దమ్ము ట్రాక్టర్లను రోడ్లపై తిప్పవద్దు

కోడూరు: కోట్లాది రూపాయలు పెట్టి నిర్మించిన రహదారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందని ఎస్‌ఐ చాణిక్య అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో గురువారం వి.కొత్తపాలెం గ్రామంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్ల యజమానులు దమ్ము చక్రాలతో ప్రధాన రహదారులపై తిరగడం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఎస్‌ఐ తెలిపారు. కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిని రూ.16.80 కోట్లతో నూతనంగా నిర్మించారని, ఈ నూతన రహదారిపై దమ్ము ట్రాక్టర్లు తిప్పితే ఎలా అని ప్రశ్నించారు. దమ్ము చక్రాలకు రింగులు వేసుకోవాలని, లేకుంటే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.